గురుపౌర్ణమిని ఘనంగా నిర్వహిస్తాం

నల్లకుంట: బాగ్ అంబర్‌పేటలోని శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో వచ్చేనెల 7 నుంచి 10వ తేదీ వరకు నాలుగు రోజుల పాటు గురుపౌర్ణమి మహోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. 7వ తేదీన శ్రీసాయి అఖండ ఏకనామ సంకీర్త ఉంటుందన్నారు. 8వ తేదీన లలిత సహస్రనామ స్తోత్ర పారాయణతో సాయిబాబాకు లక్షపుష్పార్చన ఉంటుందని చెప్పారు. 10వ తేదీన విష్ణు సహస్ర నామ స్తోత్ర పారాయణంతో సాయిబాబాకు లక్ష పుష్పార్చన ఉంటుందని వివరించారు. ఉదయం 5 గంటలకు నగర సంకీర్తన, కాకడ హారతి, మంగళ స్నానం, అర్చన ఉంటాయన్నారు. అనంతరం గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, మండపారాధన, ఏకాదశ కలశ స్థాపనా పూర్వక అభిషేకం, గాయత్రి హోమం-పూర్ణాహుతి ఉంటాయని తెలిపారు.

చిత్రపరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం కృషి



కాచిగూడ: తెలుగు చిత్ర పరిశ్రమ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన నేతలు టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్‌గౌడ్‌ను ఆదివారం కలిసి గద్దర్ పేరుతో అవార్డులు అందజేయడం పట్ల కృతజ్ఞతలు తెలియజేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ సలహాదారుడు వేణుగోపాల్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నాగభూషణం, లక్‌పతి యాదగిరి గౌడ్, తోలుపునూరి కృష్ణగౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

నాట్యంతో క్రమశిక్షణ



మాట్లాడుతున్న డాక్టర్ ఎస్‌పీ భారతి

చిక్కడపల్లి: బాల నాట్య కళాకారులను ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధిస్తారని కూచిపూడి నాట్యగురువు, కేంద్ర సంగీత నాటక అకాడమి సభ్యురాలు డాక్టర్ ఎస్‌పీ భారతి అన్నారు. సిద్ధ నాట్య కళా సమితి ఆధ్వర్యంలో చిక్కడపల్లిలో కూచిపూడి నృత్య ప్రదర్శనలను ఆదివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ ఎస్‌పీ భారతి బాల కళాకారులను అభినందించారు. విద్యార్థులు చదువుతో పాటు నాట్యంలో శిక్షణ పొందడం వల్ల వారిలో క్రమశిక్షణ, అంకితభావం పెరుగుతుందని అన్నారు. నాట్య గురువు వాణీరమణ,వాస గోపీనాథ్, వై.మల్లేశ్వర్‌రావు, సుధామాల తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా శివకుమార్



శివకుమార్

ముషీరాబాద్: బీజేపీ భోలక్‌పూర్ డివిజన్ ప్రధాన కార్యదర్శిగా మహాత్మానగర్‌కు చెందిన పార్టీ సీనియర్ నాయకుడు ఎర్రబోయిన శివకుమార్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్ ప్రకటించారు. ఆదివారం శివకుమార్ విలేకరులలో మాట్లాడుతూ తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఆర్.విశ్వం, బిజ్జి కనకేష్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు రాజశేఖర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భోలక్‌పూర్‌లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ట్రస్మా నూతన కమిటీ ఎన్నిక



చిక్కడపల్లి: ట్రస్మా ముషీరాబాద్ మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. చిక్కడపల్లిలో ట్రస్మా సమావేశంలో అధ్యక్షుడిగా ఎస్.సందీప్‌కుమార్‌గుప్తా,ప్రధాన కార్యదర్శిగా మహేష్, కోశాధికారిగా ఆర్.రాజేశ్వరి, కోశాధికారిగా జైసింహగౌడ్‌ను అభినందించారు. కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు యాదగిరిశేఖర్‌రావు,కోశాధికారి జైసింహగౌడ్, హైదరాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ, వర్కింగ్ అధ్యక్షుడు ఆర్‌వీఎల్ఎన్ ప్రసాద్ పాల్గొన్నారు.

ఎప్‌సెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు సన్మానం 6న

కాచిగూడ: తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండు తెలుగు రాష్ట్రాలు వేరువేరుగా నిర్వహించిన ఎప్‌సెట్ -2025లో ఉత్తమ ర్యాంకులు సాధించిన 100 మంది ఆర్యవైశ్య విద్యార్థులను వచ్చే నెల 6వ తేదీన గోల్డ్‌మెడల్స్‌తో సత్కరించనున్నట్లు ఆవోపా బ్యాంక్‌మెన్ చాప్టర్ అధ్యక్షుడు పీవీ రమణయ్య, ముఖ్య సలహాదారు కె.రామనందం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 28వ తేదీలోగా పంపాలన్నారు. వివరాలకు ఫోన్: 94419 28528.

సమయం ఇవ్వండి సారూ..

- మున్సిపల్ మార్కెట్ కూల్చేందుకు సిద్ధమవుతున్న అధికారులు
- నెల రోజుల్లో షాపులు ఖాళీ చేయాలని నోటీసులు జారీ
- మూడు నెలల గడువు కోరుతున్న షాపుల యజమానులు



కూల్చివేయవద్దంటూ కోరుతున్న దుకాణ యజమానులు, స్థానికులు తదితరులు (ఫైల్)

చిక్కడపల్లి: గాంధీనగర్ డివిజన్‌లోని బాపూనగర్ వద్ద ఉన్న చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్‌ను కూలిచ్చివేసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. నెల రోజుల్లో షాపులను ఖాళీ చేయాలని ఇప్పటికే అధికారులు నోటీసులు జారీ చేశారు. నెల రోజులు గడువు ఇవ్వగా దాదాపు ఎనిమిది రోజులు గడిచిపోయింది. కేవలం నెల రోజుల్లోనే ఖాళీ చేయాలనడంతో దుకాణాల యజమానులు ఆందోళన చెందుతున్నారు. షాపులు ఖాళీ చేసేందుకు గడువు పెంచాలని కోరుతున్నారు. ఈ మున్సిపల్ మార్కెట్‌ను 1976లో అప్పటి ముఖ్యమంత్రి జలగం వెంగళ్‌రావు ప్రారంభించారు. 70 షాపుల యజమానులు, వాటిలో పనిచేసే వర్కర్స్‌తో సుమారు 600మంది వరకు ఉంటారు. ఇందులోనే సేవా కేంద్రం కూడా కొనసాగుతోంది. ఈ భవనం శిథిలావస్థకు చేరుకోవడంతో అధునాతన భవనం నిర్మాంచేందుకు దాదాపు ఐదేళ్ల క్రితం అప్పుడు మంత్రులుగా ఉన్న కేటీఆర్, నాయిని నర్సింహరెడ్డితో పాటు పలువురు శిలాఫలకం వేశారు. ప్రస్తుతం దుకాణాల యజమానులకు నోటీసులు అందజేశామని, బకాయిలు పూర్తిగా చెల్లించిన వారికి మార్కెట్ నిర్మాణం పూర్తయిన తర్వాత షాపులను కేటాయిస్తామని అధికారులు అంటున్నారు. అయితే మాజీ ఎంపీ వీహెచ్, మంత్రి పొన్నం ప్రభాకర్, కార్పొరేటర్ ఎ.పావనిని కలిసిన దుకాణాల యజమానులు, చిక్కడపల్లి మున్సిపల్ మార్కెట్ మర్చెంట్ అసోసియేషన్ వారు మూడు నెలల గడువు కోరారు.

షాపులు మాకే కేటాయించాలి

షాపులను తిరిగి మాకే కేటాయించాలి. ఖాళీ చేసేందుకు సమయం ఇవ్వాలి. అధికంగా వేసిన అద్దెలను సరిచేయాలి. చిన్నచిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. మార్కెట్‌ను అత్యాధునికంగా నిర్మించి అన్ని సౌకర్యాలు కల్పించాలి.

– ఎం.శ్రీనివాస్, మర్చెంట్ అసోసియేషన్ కోశాధికారి

దుకాణదారులను ఆదుకోవాలి

మార్కెట్ కమిటీ, అసోసియేషన్, బస్తీవాసులంతా కలిసి అధికారులతో చర్చించాం. కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి సమస్యను వివరించి వారి సూచన మేరకు అధికారులతో సమీక్షిస్తాం. ఇప్పటికే ఈ ప్రాంతాన్ని డీఈఈ ప్రాజెక్ట్స్ సుదర్శన్,ఏఈ స్ఫూర్తి, టౌన్‌ప్లానింగ్ అధికారులు సందర్శించారు.

– ఎ.పావనివినయ్‌కుమార్ కార్పొరేటర్ గాంధీనగర్ డివిజన్

నెల రోజుల్లో కూల్చివేతలు

దుకాణ యజమానులకు నోటీసులు అందజేశాం. అద్దె బకాయిలు చెల్లించిన వారే తిరిగి షాపులు కేటాయించేందుకు అర్హులు. పాతభవనాలను కూల్చివేసి అధునాతన మార్కెట్ భవనం నిర్మిస్తాం. ఆరు ఫ్లోర్లతో భవనం నిర్మిస్తాం.

– పి.రామానుజులరెడ్డి, డీఎంసీ, ముషీరాబాద్ సర్కిల్-15.

యాత్రికులకు ఆర్టీసీ ప్రత్యేక టూర్ ప్యాకేజీ

కాచిగూడ: టీఎస్ ఆర్టీసీ ఆధ్వర్యంలో యాత్రికుల కోసం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లోని ఆలయాలు, విహార ప్రాంతాల సందర్శన కోసం ప్రత్యేక ప్యాకేజీతో కూడిన బస్సులను నడుపుతున్నట్లు బర్కత్‌పుర డిపో మేనేజర్ ఆర్.మంజులరెడ్డి తెలిపారు. బర్కత్‌పుర డిపో నుంచి హైదరాబాద్ సిటీ, వరంగల్, జోగులాంబ గద్వాల్, వికారాబాద్ ప్రాంతాలను అనుసంధానం చేస్తూ తక్కువ ధరలో వివిధ రకాల ప్యాకేజీలతో బస్సులను నడుపుతున్నట్లు తెలిపారు. జోగులాంబ గద్వాల్‌లో అలంపూర్ జోగులాంబ ఆలయం, నవ బ్రహ్మ ఆలయం, పాపావినాశిని, సంగమేశ్వర్ స్వామి ఆలయం, జూరాల ప్రాజెక్టు సందర్శనకు పెద్దలకు ఒక్కరికి రూ.1,450, పిల్లలకు రూ.1,000. వికారాబాద్, అనంతగిరిహిల్స్, కోట్‌పల్లి రిజర్వాయర్ ఈ ప్యాకేజీలో పెద్దలకు ఒక్కరికి రూ.వెయ్యి, పిల్లలకు రూ.600గా నిర్ణయించినట్లు తెలిపారు. నగరంలో ట్యాంక్‌బండ్, గోల్కొండ పోర్ట్, సాలర్‌జంగ్ మ్యూజియం, చార్మినార్ సందర్శన కోసం పెద్దలకు ఒక్కరికి రూ.300, పిల్లలకు రూ.150 ఉంటుందన్నారు. రామప్ప టెంపుల్, వరంగల్ పోర్ట్, భద్రకాళి ఆలయం, సందర్శన కోసం పెద్దలకు రూ.1,100, పిల్లలకు రూ.700 ఉంటుందన్నారు. టూర్ ప్యాకేజీ బస్సులు హైదరాబాద్ ఎంజీబీఎస్ నుంచి ప్రారంభమవుతాయన్నారు. వివరాలకు ఫోన్: 90004 06069.

కార్యకర్తలు కష్టపడితేనే బీఆర్ఎస్ పటిష్టం



శ్రీకాంత్‌ను సన్మానిస్తున్న ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి: బీఆర్ఎస్ బలోపేతానికి కార్యకర్తలు మరింత కృషి చేయాలని ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ పిలుపునిచ్చారు. పార్టీని బలోపేతం చేయడంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలు విరివిగా నిర్వహిస్తున్న పార్టీ గాంధీనగర్ డివిజన్ ప్రధాన కార్యదర్శి పోతుల శ్రీకాంత్‌ను ఎమ్మెల్యే ముఠా గోపాల్ ఆదివారం సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ బలోపేతం కోసం పార్టీకి చెందిన ప్రతి కార్యకర్త మరింత కృషి చేయాలని సూచించారు. పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముడారపు రాకేష్‌కుమార్, నాయకులు పున్న సత్యనారాయణ, కిరణ్, ఆకుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవానికి తరలిరావాలి



మాట్లాడుతున్న వెంకటస్వామి మాదిగ

సికింద్రాబాద్: ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు మాదిగలంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ ఇ.వెంకటస్వామిమాదిగ పిలుపునిచ్చారు. మధురానగర్ కమ్యూనిటీహాల్‌లో జిల్లా అధికార ప్రతినిధి డప్పు మల్లికార్జున్ నేతృత్వంలో బౌద్ధనగర్ డివిజన్ ఎమ్మార్పీఎస్ కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఆయన హాజరై మాట్లాడుతూ.. మందకృష్ణ మాదిగ పోరాటం వల్లే రిజర్వేషన్ల కల సాకారం అయ్యిందన్నారు. మాదిగ ఉద్యోగులు, విద్యార్థులు, యువకులు ఆవిర్భావ దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు టీవీ నరసింహారావు, నరేశ్, దేవేందర్, విజయరావు, మహేశ్, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూలో ముగిసిన జాతీయ సదస్సు



పురస్కారాలు అందుకున్న పాత్రికేయులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ దూరవిద్య కేంద్రం ఆడిటోరియంలో జాతీయ సదస్సు ఆదివారం ముగిసింది. వర్కింగ్ జర్నలిస్ట్స్ ఆఫ్ ఇండియా, ఓయూ బీఈడీ కాలేజీ, ఆంధ్రామహిళా సభ విద్యా కళాశాల ఆధ్వర్యంలో 'జాతీయ విద్యా విధానం -మీడియా పాత్ర' అనే అంశంపై సదస్సు నిర్వహించగా ఇఫ్లూ వీసీ ప్రొ.నాగరాజు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన పాత్రికేయులకు పురస్కారాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో డబ్ల్యూజేఐ జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ, రాష్ట్ర అధ్యక్షుడు రాణాప్రతాప్, ప్రధాన కార్యదర్శి రావికంటి శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కరుణాకర్, సీనియర్ జర్నలిస్ట్ వల్లీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

పట్టుదల, క్రమశిక్షణతో ఏదైనా సాధ్యమే

రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి



ఓలేటి పార్వతీశాన్ని కిన్నెర ద్వానాశాస్త్రి స్మారక పురస్కారంతో సన్మానిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు

చిక్కడపల్లి: పట్టుదల క్రమశిక్షణతో ఏదైనా సాధించవచ్చని రాష్ట్ర ప్రభుత్వ మాజీ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి అన్నారు. చిక్కడపల్లి త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో కిన్నెర ఆర్ట్ థియేటర్స్, త్యాగరాయ గానసభల సంయుక్తాధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన సాహిత్య సవ్యసాచి ద్వానా శాస్త్రి జయంతిలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ సాహితీవేత్త ఓలేటి పార్వతీశానికి కిన్నెర ద్వానా శాస్త్రి స్మారక పురస్కారాన్ని ఆయన ప్రదానం చేసి సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ద్వానాశాస్త్రి సాహిత్య అధ్యయనం గొప్పదని కొనియాడారు. కార్యక్రమంలో గానసభ అధ్యక్షుడు వీఎస్ కళాజనార్దనమూర్తి, ప్రముఖులు వల్లీశ్వర్, బైసా దేవదాసు, ద్వాదశి శశికాంత్, మద్దాళి రఘురాం తదితరులు పాల్గొన్నారు.

వీణాచారికి ఓయూ డాక్టరేట్

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఫిజిక్స్ విభాగం విద్యార్థి వి.వీణాచారికి పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఫిజిక్స్ విభాగం అధ్యాపకుడు డా.ఎస్‌వీ ప్రసాద్ పర్యవేక్షణలో ఎలక్ట్రికల్ అండ్ మాగ్నెటిక్ స్టడీస్ ఆన్ ఆరివిలియస్ ఫేజ్ మల్టీఫెరోయిక్ కాంపౌండ్స్ అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ లభించినట్లు తెలిపారు. జోగులాంబ గద్వాల జిల్లా అయిజ పట్టణానికి చెందిన వీణాచారి 2017లో సీఎస్ఐఆర్-నెట్‌లో 169వ ర్యాంక్ సాధించి జేఆర్ఎఫ్ ఫెలోషిప్‌కు ఎంపికైనట్లు పేర్కొన్నారు. మనోపడ్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో లెక్చరర్‌గా పని చేస్తున్న వీణాచారి తన పరిశోధనలో కొంత భాగాన్నియూఎస్ఏలో, హైదరాబాద్‌లోని డీఆర్ఎంఎల్, డీఆర్‌డీఓలో పూర్తి చేసినట్లు తెలిపారు. పరిశోధనలకు సహకరించిన అధ్యాపకులు, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపారు.

గొల్ల కురుమలకు రాజకీయ అవకాశాలు కల్పించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: గొల్ల కురుమలకు రాజకీయాల అవకాశాలు కల్పించాలని బీసీ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మనబోయిన సైదులు యాదవ్ ఆదివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 28 లక్షల జనాభా గల గొల్ల కురుమలకు సీఎం రేవంత్ రెడ్డి మంత్రి వర్గంలో చోటు కల్పించకపోవడం విచారకరమన్నారు. భవిష్యత్తులో అయినా పాలన పదవులు, నామినేటెడ్ పోస్టుల్లో అవకాశాలు కల్పించాలని కోరారు.

'అప్పుల్లో కూరుకుపోతున్న తెలంగాణ'

సికింద్రాబాద్: కష్టాలు, నష్టాల్లో ఉన్న బీహార్, యూపీ రాష్ట్రాలు అన్నిరంగాల్లో అభివృద్ధి సాధిస్తుండగా సంపన్న రాష్ట్రంగా ఉన్న తెలంగాణ మాత్రం అప్పుల ఊబిలో కూరుకుపోతున్నదని నేషనల్ కమిషన్ షెడ్యూల్ ట్రైబ్స్ మెంబర్ ఏ. జాతు హుస్సేన్ నాయక్ అన్నారు. తెలంగాణ స్టేట్ యానాదిస్ (గిరిజన) వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్టుగూడ రైల్వే ఆఫీసర్స్ క్లబ్‌లో యానాదుల ఆత్మగౌరవ సభ తదితర కార్యక్రమాలు ఆదివారం జరిగాయి. ముఖ్య అతిథులుగా ఐఏఎస్ అధికారి ఈ శ్రీధర్, గిరిజన అసోసియేషన్ చైర్మన్ ఈ ఆంజనేయులు, జాతీయ గిరిజన ఉద్యోగుల సంఘం జాతీయ అధ్యక్షుడు పివి రమణతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఉచిత పథకాలకు స్వస్తి పలికి మెరుగైన విద్య, వైద్యం అందించాలన్నారు. బడుగు బలహీన వర్గాలు, హరిజన గిరిజన తెగలకు చెందిన వారంతా తమ పిల్లలను ఉన్నత విద్యనందించడం ద్వారా సామాజిక ప్రగతి సాధించవచ్చని చెప్పారు. అనంతరం తెలంగాణ స్టేట్ యానాదిస్ (గిరిజన) వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. చైర్మన్‌గా ఈ ఆంజనేయులు, అధ్యక్షుడిగా సీహెచ్ రామచంద్రరావు, జనరల్ సెక్రటరీగా ఐ సాంబశివరావు, ట్రెజరర్‌గా జేసీ శేషాద్రిని ఎన్నుకున్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు శ్రీనివాసులు, ఏడుకొండలు, పార్థసారథి, సీహెచ్ వెంకటేశ్వర్లు, శివశంకర్ రావు, ప్రభాకర్ రావు, రామకృష్ణయ్య ఆర్ సురేశ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్లమ్మ కల్యాణ ఏర్పాట్లపై నేడు మంత్రుల సమావేశం

అమీర్‌పేట: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణ మహోత్సవ ఏర్పాట్లపై ఈనెల 16న (నేడు) మంత్రులు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ అధికారులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆలయ ఆవరణలో ఉదయం 11 గంటలకు హైదరాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగే సమావేశానికి దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ హాజరవుతారని పేర్కొన్నారు.

ఇష్టపడి చదివితే ఉజ్వల భవిత

ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్



విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

కాచిగూడ: ఇష్టపడి చదివినప్పుడే విజయాలు వాటంతట అవే వస్తాయని, తద్వారా ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. భావ్‌సార్ క్షత్రియ గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం కాచిగూడలోని భావసార్ భవన్‌లో విద్యార్థులకు నోట్ బుక్స్, స్కూల్ బ్యాగ్స్ పంపిణీ చేశారు. ఇటీవల జరిగిన వివిధ పరీక్షల్లో మెరిట్ సాధించిన భావసార్ విద్యార్థులకు ప్రోత్సాహంగా చెక్కులను అందజేశారు. విద్యకు ప్రాధాన్యతనిచ్చే సంస్థలు సమాజ అభివృద్ధికి మూలస్తంభాలుగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమంలో భావసార్ క్షత్రియ రంగ్రేజ్ సమాజ్ అధ్యక్షుడు ఉమేష్ జైతానే, అశ్విన్ పతంగే, శ్రీధర్ లోకండే, మధుసూధన్ గడాలే, సత్యనారాయణ, అమర్‌నాథ్, దయానంద్, సత్యనారాయణ, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ



తెలంగాణ ప్రజా ఫ్రంట్ మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: వరంగల్‌లో ఈ నెల 29, 30వ తేదీల్లో నిర్వహించే తెలంగాణ ప్రజా ఫ్రంట్ మహాసభలను విజయవంతం చేయాలని కోరుతూ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో పోస్టర్‌ను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజా ఫ్రంట్ రాష్ట్ర కమిటీ సభ్యుడు కడమంచి రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రం ఏర్పడి 11 ఏళ్లు అవుతున్నా ప్రజల ఆశలు నెరవేరలేదన్నారు. అమరవీరుల త్యాగాలు నిష్ప్రయోజనంగా మారాయన్నారు. కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం నియంతృత్వంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రజల హక్కుల పరిరక్షణకు పోరాటాలే శరణ్యం అన్నారు. కార్యక్రమంలో నాయకులు ఆజాద్, ముత్తన్న, ఉప్పల సోమయ్య, ఎం.రాజు, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

సేంద్రియ వ్యవసాయాన్ని కేంద్రం ప్రోత్సహించాలి



కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రికి వినతి పత్రం సమర్పిస్తున్న ఈపీడీసీ సభ్యులు

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: సేంద్రియ వ్యవసాయానికి కేంద్ర ప్రభుత్వం మరింత ప్రోత్సహించాలని కోరుతూ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అధ్యక్షుడు ఎస్‌సీహెచ్ రంగయ్య, జాతీయ సలహాదారుడు డాక్టర్ కోమటిరెడ్డి గోపాల్‌రెడ్డి కేంద్ర స్కిల్ డెవలప్‌మెంట్ శాఖ మంత్రి జయంత్‌సింగ్‌కు ఆదివారం వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుత రసాయన వ్యవసాయం వల్ల భూసారం తగ్గి పంటల పోషక విలువలు పడిపోతుంటాయని, దీని వల్ల మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతుందని తెలిపారు. ప్రతి కుటుంబాన్ని సేంద్రియ కుటుంబంలో భాగస్వామ్యం చేయాలని, శిక్షణ, రాయితీలు, విత్తనాలు, సహజ ఎరువుల తయారీకి మౌలిక వసతులు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. సేంద్రియ ప్రకృతి మిషన్‌ను 100 శాతం రాయితీతో నడిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కపిలవాయి దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించాలి



మాట్లాడుతున్న మాజీ మంత్రి కృష్ణయాదవ్

కాచిగూడ: ప్రధాని మోదీ సారథ్యంలో దేశం గణనీయమైన అభివృద్ధి సాధిస్తోందని బీజేపీ నేత, మాజీ మంత్రి కృష్ణయాదవ్ అన్నారు. కాచిగూడ డివిజన్ కాశీరామ్ జీరా, ఇందిరానగర్ బస్తీలో బీజేపీ ఆధ్వర్యంలో 'వికసిత భారత్ సంకల్ప సభ'ను ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11 ఏళ్ల మోదీ ప్రభుత్వ పాలనలో భారత్ అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కన్నె ఉమా రమేష్‌యాదవ్, పార్టీ నేతలు సి.నందకిషోర్ యాదవ్, ఎ.సూర్యప్రకాష్ సింగ్, ఎక్కాల నందు, సుభాష్ పటేల్, బి.భీమ్ రాజ్, ఎస్.రవియాదవ్, బల్వీర్, శేర్‌సాగర్, ఎస్.అరవింద్, హాజారి బాబు, కృష్ణకుమార్, శ్యామ్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.

అన్ని రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించాలి

కవాడిగూడ: విద్యార్థుల అభిరుచులను తెలుసుకొని ఆ దిశగా ప్రోత్సహించాలని ఆర్యన్ ఆర్ట్స్ అకాడమీ వ్యవస్థాపకులు సరోజ్ బాలా ఠాకూర్ తల్లిదండ్రులకు సూచించారు. కవాడిగూడలోని ఆర్యన్ ఆర్ట్స్ అకాడమీ తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త ఆధ్వర్యంలో నెల రోజుల పాటు విద్యార్థులకు నిర్వహించిన థియేటర్ వర్క్‌షాపు నిర్వహించారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ చేతులమీదుగా అవార్డులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో ప్రోత్సహించాలని అన్నారు.

ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలి

హిమాయత్‌నగర్: అడవుల్లోని ఖనిజ సంపదను, వనరులను కార్పొరేట్లకు దోచిపెట్టే ఆపరేషన్ కగార్‌ను వెంటనే ఆపాలని అఖిల భారత యువజన సమాఖ్య(ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు, కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కల్లూరు ధర్మేంద్ర కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హిమాయత్‌నగర్‌లోని ఏఐవైఎఫ్ రాష్ట్ర కార్యాలయం (సత్య నారాయణ రెడ్డి భవన్)లో జరిగిన ఏఐవైఎఫ్ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివాసీలపై దమనకాండను ఆపాలని, కేంద్ర ప్రభుత్వం కాల్పుల విరమణను ప్రకటించి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలు జరపాలని డిమాండ్ చేస్తూ 23న చలో రాజ్ భవన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ వెంకటేశ్వర్లు, నానబాల రామకృష్ణ, బిజ్జ శ్రీనివాసులు, టి.సత్య ప్రసాద్, పేరబోయిన మహేందర్, శ్రీమాన్, కొండల్, రాష్ట్ర సమితి సభ్యులు ఎల్లంకి మహేష్, ఉపేంద్ర, సల్మాన్ బేగ్, శివ కుమార్, రాజేష్, మహమూద్, మాజీద్, మహేష్, మధు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలతో పేదలకు లబ్ధి



వికసిత భారత్-సంకల్ప సభలో బీజేపీ నాయకులు

ముషీరాబాద్: ప్రధాని నరేంద్రమోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలన్నీ పేదలకు లబ్ధి చేకూరుస్తున్నాయని సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధ్యక్షుడు భరత్‌గౌడ్ అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వం ఏర్పడి 11 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా అడిక్‌మెట్‌లోని వడ్డెర బస్తీ కమిటీ హాల్‌లో వికసిత భారత్-సంకల్ప సభను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన భరత్‌గౌడ్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో అన్ని రంగాల్లో భారత్ విశ్వగురువుగా అవతరిస్తుందన్నారు. ఏ ఎన్నికలు జరిగినా బీజేపీ విజయమేనని, ఇందుకు అనుగుణంగా కార్యకర్తలు కష్టపడి పని చేయాలన్నారు. ముషీరాబాద్ బీజేపీ కన్వీనర్ రమేషరామ్ మాట్లాడుతూ ముషీరాబాద్ అసెంబ్లీ పరిధిలో బీజేపీ చేపట్టే వివిధ కార్యక్రమాలను జయప్రదం చేయాలన్నారు. బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రోయ్యూరు శేషసాయి, డివిజన్ అధ్యక్షుడు పి.సాయికృష్ణయాదవ్, రాష్ట్ర నాయకులు, నగర నాయకులు, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.